ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

3★★

బుధవారం 4 డిసెంబరు 2024

నేడు పెద్దపల్లిలో
సీఎం సభ
● డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల రాక
● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన 5

'మధ్యాహ్న భోజన' కార్మికుల ఆందోళన
సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ 6

ప్రభుత్వ వ్యతిరేకత అనేది ప్రతిపక్షాల కుట్ర 6
పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్

వైద్యులు సమయ పాలన పాటించాలి
సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ 6

ఉపాధి కరువు



జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారుతోంది. చేతి నిండా పని దొరకకపోవడంతో కార్మికులకు జీవనం భారం అవుతోంది. కొన్నేళ్లుగా ఈ రంగంపై ఆధార పడిన వారికి ఉపాధి కరువవుతోంది. దీన్నే జీవనాధా రంగా మార్చుకున్న ఎంతో మంది ప్రత్యామ్నాయం లేక ఆపసోపాలు పడుతున్నారు. ఏళ్లుగా ఎన్నో వేతలు అనుభవిస్తున్న కార్మికులు, బతుకు బండి లాగేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

బీడీ కార్మికుల పరిస్థితి..

రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో సుమారు 7.50 లక్షల మంది పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో రాష్ట్రంలో సుమారు 4.07 లక్షల మంది జీవన భృతి పొందుతున్నట్లు అంచనాలున్నాయి. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది పీఎఫ్ కార్మికులు, సుమారు 60 వేల మంది నాన్ పీఎఫ్ కార్మికులుండగా ఇందులో ఎక్కువగా జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కార్మికులు పనిచేస్తున్నట్లు అంచనా ఉంది. బీడీ కార్మికులకు చేయూత నిచ్చేందుకు ఆసరా కింద ప్రత్యేక జీవన భృతిని ప్రభుత్వం ప్రతీ నెల అందిస్తోంది. జిల్లాలో ప్రభుత్వం 88,839 మంది బీడీ కార్మికు లకు జీవన భృతి అందిస్తోంది.

చేతి నిండా పనిలేక...

చెమటోడ్చి శ్రమించే ఎంతో మంది బీడీ కార్మికులు చేతినిండా పని లేక ఆపసోపాలు పడుతున్నారు. వచ్చే సొమ్ము గిట్టుబాటవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఈ పరిశ్రమ విస్తరిం చింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్‌లలో అనేక గడపలకు విస్తరించిన ఈ కుటీర పరిశ్రమ ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. పని దినాలు తగ్గి ప్రత్యామ్నాయం లేక ఉసూరుమంటున్నారు. మరోవైపు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా జీఎస్టీ కారణంగా కంపెనీలకు నిర్వహణ భారం కాగా నెలకు 10 నెంచి 15 రోజులు మాత్రమే ఉపాధి కల్పిస్తున్నాయి. పనిదినాలు కుదించడంతో దానిపై ఆధార పడి జీవించే వారు ఇక్కట్లు పడుతున్నారు.

పక్షం రోజులకు మించి దొరకని పని
సంక్షేమ బోర్డు ద్వారా అందని పథకాలు

ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న బీడీ కుటీర పరిశ్రమ

కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే మేలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది బీడీ కార్మికులు

(తరువాయి 6వ పేజీలో)



వీధి వ్యాపారులను.. తైబజార్ పన్ను నుంచి మినహాయించాలి

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణాల్లో గల చిరు వీధి వ్యాపారులకు తైబజారు పన్ను నుంచి మినహాయించాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా అమలు చేస్తున్న వీధి వ్యాపారుల తైబజార్ అంగడి చిట్టి వ్యవహారాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా గల పట్టణాలకు వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా అర్బన్ డే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక లేఖను పంపుతున్నానని వెల్లడించారు. ప్రభుత్వాల నుంచి ఆశించిన మేరకు నిధులు సమకూర్చుకోలేకపోవడంతో, స్థానికంగా వనరులు పొందడానికి పట్టణాల్లో ఇంటి పన్ను, వాణిజ్య పన్నులతో పాటు చిరువ్యాపారుల వద్ద నుంచి సైతం అంగడి పన్ను వసూలు చేస్తున్నారన్నారు. చిరు వీధి వ్యాపారులపై మున్సిపాలిటీ పన్ను విధానాన్ని జగిత్యాల పట్టణంలో 1996 సంవత్సరం నుంచి తైబజార్ అంగడి చిట్టి వసూలు రద్దు చేశామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిరు వ్యాపారుల తైబజార్, అంగడి చిట్టి పన్ను రద్దు ద్వారా జగిత్యాల మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజాపాలన కార్యక్రమ ఇన్‌చార్జి ఏబీ శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ దేవేందర్, మోహన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

ఎంఈవో శ్రీపతి

రాయికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం భోజనం అందించాలని రాయికల్ ఎంఈవో శ్రీపతి రాఘవులు అన్నారు. మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థ తకు గురైన సందర్భంగా ఉన్నతాధికా రులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, కిచెన్ షెడ్డు వద్ద శుభ్రత పాటించాలన్నారు. బియ్యంలో ఎలాంటి రాళ్లు, పురుగులు రాకుండా శుభ్ర పరిచి బాగా కడిగిన తర్వాతనే వండాలన్నారు. కూరగా యలు నాణ్యమైన వాటినే కొని వంట చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, సీఆర్పీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి చిరస్మరణీయుడు

మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్

కోరుట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పోరాటంలో శ్రీకాంత చారి చిరస్మరణీయుడని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్ అన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి వర్థంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి మున్సిపల్ కార్యాలయంలో పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పించిన పాలక వర్గ సభ్యులు శ్రీకాంత చారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు.

కథలాపూర్ : తెలంగాణ పోరాటంలో అమరుడైన శ్రీకాంతాచారి వర్థంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. పోతారం, కథలాపూర్ గ్రామాల్లో శ్రీకాంతాచారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ధర్మపురి జలంధర్, శ్రీనివాస్, హరిప్రసాద్, అశోక్ తదితరులు ఉన్నారు.

వెల్గటూర్: తెలంగాణ మలిదశ తొలి అమరవీరుడు శ్రీకాంత్ చారి వర్థంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు సంకోజు తిరుమల్ చారి డిమాండ్ చేశారు. మంగళవారం వెల్గటూర్‌లో మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాధనకు అసువులు బాసిని కాసోజు శ్రీకాంతచారి వర్థంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రామగిరి నందయ్య, నాయకులు పాల్గొన్నారు

జగిత్యాలరూరల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్థంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర అధికార ప్రతినిధి నామపల్లిరెడ్డి హాజరై శ్రీకాంత్‌చారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజిరెడ్డి, రాగులరాజు, నియోజకవర్గ కన్వీనర్ కొండ్ర ప్రేమ్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగారెడ్డి పాల్గొన్నారు.

గొల్లపల్లి : శ్రీకాంతా చారి 15వ వర్థంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న శ్రీకాంతా చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో శ్రీకాంతా చారి ఆత్మబలిదానంతోనే మలి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడి తెలంగాణ ప్రజల కల సాకారమైందని, ఆయన చేసిన త్యాగాలను విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బలభక్తుల కిషన్ కొనియాడారు. శ్రీకాంతా చారి వర్థంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు శ్రీకోటి భూమయ్య, నాయకులు భాస్కరా చారి, శంకరయ్య పాల్గొన్నారు.



కథలాపూర్‌లో శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విశ్వకర్మలు

సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తా..

● నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా
● రెండో సారి గెలుపుతో మరిన్ని బాధ్యతలు పెరిగాయి
● ఏడాది పాలనపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన యేడాది కాలంగా ఇటు వ్యక్తిగతంగా...అటు రాజకీయంగా ఒడిదుడుకులు ఎదురయ్యాయి. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు పలుకుతూ గత యేడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు మరోమారు గెలిపించారు. రెండో పర్యాయం గెలుపుతో మరింత బాధ్యత పెరిగింది. రాజకీయాల్లో అనేక నాటకీయ పరిస్థితులు ఎదుర్కొన్నాను. రెండోసారి నా గెలుపుపై పలువురికి నమ్మకం లేదు.. అయితే నేను మాత్రం పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహించి రెండో గెలుపు ఖాయమని బావించాను. ఎలా ఊహించామో అదే విధంగా ఫలితాలు వచ్చాయి. అందరి అంచనాలు తల కిందులు చేస్తూ జగిత్యాల నుంచి వరసగా రెండోసారి గెలిచానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాది గడిచిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పం చుకున్న అనుభవాలు ఆయన మాటల్లోనే..

● అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..


నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాను. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాను. గతంలో మంజూరు చేసిన పనులు, శంకుస్థాపన చేసిన పనులు అర్ధాంతరంగా ఆగిపోకుండా అవసరమైన కృషి చేస్తున్నాను. ఇందుకు సీఎంతో పాటు ఆ యా శాఖలకు బాధ్యతలు వహిస్తున్న మంత్రులు, ఇతర ప్రభుత్వ పెద్దల సహకారాలను తీసుకుంటున్నాను. అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయాల్సిన అవసరం తప్పనిసరైంది.

● ప్రజలకు జావాబుదారీగా ఉండేందుకు...

నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా ఉండడానికి ప్రయత్నం చేస్తున్నాను. ఇందుకు నిరంతరం అభివృద్ధిపైనే దృష్టి సారిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వంతో నాకు ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, సంక్షేమ కార్యక్రమాలను పరుగెత్తించడానికి అవసరమైన ప్రతిపాదనలు ఇలా అందిస్తే చాలు.. ప్రభుత్వ పెద్దలు అలా స్పందించి నిధులు మంజూరు చేస్తుండడం ఎన్నటికీ మరవలేను. రాజకీయాలకు అతీతంగా వెళ్లి అందరినీ కలుస్తున్నాను.

● ఏడాదిలో ఏం చేశానంటే...

జగిత్యాల నియోజకవర్గంలో గడిచిన ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగు పెట్టిస్తున్నాను. జగిత్యాల పట్టణంలో సుమారు రూ. 25 కోట్ల వివిధ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నాను. ఇందులో రూ. 10 కోట్ల నిధుల పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఇతర రూ. 15 కోట్ల నిధులతో పనులకు టెండర్లు నిర్వహిం చడానికి ప్రయత్నాలు చేస్తు న్నాము. టీఎఫ్‌ఐ నుంచి గతంలో మంజూరు అయిన రూ. 5 కోట్లు నిధులు విడుదల కావడంతో పాటు అదనంగా రూ. 5 కోట్ల నిధులు మంజూరు అయి పనులు ప్రారంభించాము. వీటితో జగిత్యాల పట్టణంలో మురికి కాలువలు, అంతర్గత సీసీ రహదారుల నిర్మాణం జరుపుతున్నాము. కేసీఆర్ కాలనీలో మంచి నీటి అభివృద్ధి పనులకు రూ. 14 కోట్లు నిధులు మంజూరయ్యాయి. విద్యుత్, మురికి కాలువల అభివృద్ధి పనులకు రూ. 18 కోట్లు నిధులు మంజూరు చేయించాను. రాయికల్ మున్సిపల్‌లో రూ. 2.90 కోట్లు బిల్లులు రావడం జ రిగింది. అదనంగా రూ. 2.80 కోట్ల వివిధ పనులకు అప్రూవల్ తీసుకొని వ చ్చి పనులను ప్రారంభిస్తున్నాను. జగిత్యాల పట్టణంలో చెత్తను తరలించ డానికి 12 ఆటోలు తెచ్చాము. జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు తరగదుల నిర్మాణానికి రూ. 5 కోట్లు మం జూరు చేయించాను. రూ. 1.70 కోట్లతో జగిత్యాల వ్యవసాయ మార్కెట్ అభి వృద్ధి చేస్తున్నాము. జగిత్యాల మున్సిపాలిటీలో రూ. 38 కోట్లతో అమృత్ 2.5 కింద మంచి నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ తదితర పనులను చేయిస్తున్నాను. నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీలతో పాటు పల్లెల్లో సైతం అభివృద్ధి పనులు వేగవంతంగా జరుపుతున్నాను.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

● విద్యా, వైద్య రంగాలపై ఫోకస్..

జగిత్యాలలో విద్యా, వైద్య రంగాలపై ప్రధానంగా ఫోకస్ చేస్తున్నాను. జగిత్యాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు మరింత వేగవంతం చేస్తున్నాను. నర్సింగ్ కళాశాల, మాతా శిశు కేంద్రం, రేడియాలజి సెంటర్, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు సమర్థవంతంగా పనిచేసేలా కృషి చేస్తున్నాను.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



మధ్యాహ్న భోజన వంట పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు నాణ్యత ప్రమాణలతో కూడిన విద్యాను నేర్పించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవానం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వంట గదిని, డైనింగ్ హాల్‌ను, స్టోర్ రూంను పరిశీలించారు. అదే విధంగా గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వసతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఆనంతరం మండలంలోని వర్షకొండ గ్రామంలో 20 లక్షలతో నిర్మిస్తున్న ప్రైమరి హెల్త్ సెంటర్ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపిడిఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత



జైనాలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ లత

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల, రాజారం, మగ్గిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కొనుగోలు కేంద్రాల్లో ఎంత కొనుగోలు చేశారని, ధాన్యం నిల్వ ఎంత ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి ధాన్యం 17 శాతం తేమతో కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని విక్రయించిన 48 గంటల్లో బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణచైతన్య, డిప్యూటీ తహసీల్దార్ సుమన్, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, సీఈవో బలుమూరి సాగర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

డీఏవో రాంచందర్

కొడిమ్యాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : రుణమాఫీ విషయమై రైతులు ఆందోళన చెందవద్దని డీఏవో సీహెచ్. రాంచందర్ అన్నారు. మంగళవార మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో రైతు నేస్తం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సంద్భంగా డీఏవో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల పైన రుణమాఫీ తొందరలో జరుగుతుందన్నారు. వరిలో నారుమడికి సంబందించి రైతులను సందేహాలను నివృత్తి చేశారు. అంతకముందు జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్ పాం తోటల పెంపకంపై, రాయితీలపై అవగాహన కలిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పాం తోటల పెంపకం ప్రోత్సహిస్తుందన్నారు. ఆయిల్ పాం మేనేజర్ విజయ్ భరత్, ఏవో జ్యోతి, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, పూడూర్ మాజీ సర్పంచు రాంరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ఏఈవోలు పాల్గొన్నారు.

భరోసా సెంటర్ ద్వారా సత్వర సేవలు

ఎస్పీ అశోక్ కుమార్



భరోసా సెంటర్ నిర్వాహకులతో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :బాధిత మహిళలకు, చిన్న పిల్లలకు భరోసా సెంటర్ ద్వారా సత్వర సేవలు అందించాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను మంగళవారం ఎస్పీ పరిశీలించారు. న్యాయ సలహా కేంద్రాన్ని సందర్శించి వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు, మహిళలపై నమోదు అవుతున్న కేసులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ మహిళల రక్షనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఆపద వచ్చినా పోలీస్ శాఖను సంప్రదించాలని కోరారు. మహిళలను, చిన్న పిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీసీ రంజిత్ రెడ్డి ఉన్నారు.

పండుటాకులకు అండగా..

అందరూ ఉండి ఆదరణ కరువైన వారు కొందరు... ఎవరూ లేక నిరాశ్రయులైన వారు మరికొందరు.. అలాంటి వారిని అక్కున చేర్చుకుంటోంది వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం. సమాజంలో వృద్ధుల పట్ల జరుగుతున్న అమానవీయ సంఘటనలను చూసి చలించిపోయిన కొందరు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంకల్పంతో ఈ ఆశ్రమం ఏర్పాటయ్యింది. కన్నబిడ్డల నిర్లక్ష్యానికి గురవుతున్న పండుటాకులను చేరదీసి క(చ)ంటిపాపలా చూసుకుంటోంది.

● నిస్సహాయ వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న ఈశ్వర కృప వృద్ధాశ్రమం



వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కొందరు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కళ్లముందు వృద్ధులకు జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిపోయారు. నిస్సహాయ స్థితిలో బాధపడుతున్న వృద్ధుల కోసం అన్ని వసతులతో కూడిన ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలో వారంతా సీనియర్ సిటిజన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌గా ఏర్పడ్డారు. వారి ఆశయానికి వీర్లపల్లికి చెందిన సీతారాంరెడ్డి తోడయ్యారు. తన సొంత స్థలంలో అన్ని వసతులతో కూడిన వృద్ధాశ్రమాన్ని నిర్మించి ఇవ్వడంతో ఈశ్వర కృప వృద్ధాశ్రమం ఏర్పాటైంది. ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న ఈ ఆశ్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సొంత ఖర్చులతో మొదలైన ఆశ్రమ నిర్వహణ ప్రస్తుతం పలువురు దాతల సహకారంతో కొనసాగుతున్నది. ఆశ్రమంలోని వారికి పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు వారానికి రెండుసార్లు వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సేవలందిస్తున్నారు. గీతా పారాయణం, టీవీ చూడటం, పత్రికలు చదవడం, యోగాలాంటి వ్యాపకాలతో వారిలో మానసికోల్లాసాన్ని నింపుతున్నారు.


ఆశ్రమంలో కూర్చొని మాట్లాడుకుంటున్న వృద్ధులు


ఆశ్రమంలో అన్నం తింటున్న వృద్ధులు

● అందరూ ఉన్నా.. అనాథను..



అయినవాళ్లందరు ఉన్నా.. అనాథగా ఉన్నాను. నా భర్త మరణించిన తరువాత నిస్సహాయ పరిస్థితుల్లో ఆశ్రమం అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం ఆశ్రమంలో అన్ని వసతులతో ఆనందంగా ఉన్నాను.

- రాజేశ్వరి, పెద్దపల్లి

● నా అనేవాళ్లు లేరు..



నా భర్త 16 ఏళ్లక్రితం చనిపోయాడు. పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటూ కూలిపనికి పోయేదాన్ని. వృద్ధాప్యం మీద పడడంతో ప్రస్తుతం కూలిపని చేసే పరిస్థితి లేదు. ఆశ్రమం అన్నం పెట్టి ఆదరిస్తోంది.

- భూదేవి, పెద్దపల్లి

● వృద్ధులకు ఆశ్రమం నిర్మించాలనే సంకల్పంతో..



వృద్ధుల కోసం ఆశ్రమం నిర్మించాలన్న సంకల్పంతో రిటైర్డ్ ఉద్యోగులం సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశాం. దాని ఆధ్వర్యంలో సభ్యుల నుంచి నిధులు సేకరించాం. ఆశ్రమం కోసం ప్రయత్నాలు చేస్తుండగా వీర్లపల్లిలో సీతారాంరెడ్డి తన సొంత స్థలంలో ఆశ్రమానికి అవసరమైన గదులు నిర్మించి ఇచ్చారు. గత ఏడాది మార్చి 24న ఈశ్వర కృప ఆశ్రమం ఏర్పాటైంది. అప్పటి నుంచి వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడే వారికి సేవలందిస్తున్నాం.

- పీటీస్వామి, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు


సాగర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపల్లి గ్రామానికి చెందిన బోగె సాగర్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్ స్నేహితుడైన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నపల్లికి చెందిన రాగుల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్, శ్రీనివాస్ కలిసి మంచిర్యాల నుంచి కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మొగ్ధుంపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు రాగానే ఇటుకబట్టీకి చెందిన ఒక లారీ రోడ్డు క్రాస్ చేస్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సాగర్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్‌కు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు సాగర్ మంచిర్యాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


చంద్రమౌళి (ఫైల్)

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌తో పప్పు చంద్రమౌళి (53) మృతిచెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన చంద్రమౌళి గత మూడు రోజుల క్రితం భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం అల్లుడు రంజిత్ ఇంటి వద్ద కింద ఉన్న 20 ఫీట్ల ఇనుపరాడ్లను భవనంపైకి ఎక్కించేందుకు చంద్రమౌళి ఎదురింట్లో ఉన్న బాలుడు వంశీకృష్ణ సహాయం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి ఇనుపరాడ్లను మెట్ల ద్వారా భవనంపైకి తీసుకువెళ్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుపరాడ్‌లు తగలడంతో విద్యుత్‌షాక్‌తో చంద్రమౌళికి తీవ్ర గాయాలు కాగా బాలుడు వంశీకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు చంద్రమౌళిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దాడు. బాలుడు వంశీకృష్ణ చేతులు, పొట్టకు గాయాలు కాగా స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. మృతుని అల్లుడు రామటెంకి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తన కూతురు, అల్లుడు, మనవరాలును చూడడానికి వెళ్లిన చంద్రమౌళి మృతిచెందడంతో కుటుంబీకులు, కాలనీవాసులు కన్నీరు మున్నీరుగా రోధించారు.

గంజాయి విక్రేతలపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పట్టణ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన రంజిత్, పట్టణంలోని సుతారి పేటకు చెందిన సాయి కిరణ్, సందీప్ అనే ముగ్గురు వ్యక్తులు రాజీవ్ చౌక్ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద 204 గ్రాముల గంజాయిని పట్టుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

కొండచిలువ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని శాతవాహన విశ్వ విద్యాలయం ఆవరణలో మంగళవారం కొండ చిలువను కరీంనగర్ అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎస్‌యూ ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం క్రికెట్ నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను వాకర్స్ గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే కరీంనగర్ ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగారావు, సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్లి స్నేక్ క్యాచర్ సన సహకారంతో నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను రక్షించారు. అనంతరం కొండ చిలువను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

చందుర్తి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లిలో మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీ కొట్టి వెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దర్శనాల రామస్వామి తోపాటు భూక్య ప్రవీణ్, అజ్మీర తిరుపతి వేములవాడకు నుంచి బండపల్లి మీదుగా గర్జనపల్లికి వెళ్తున్నారు. బండపల్లిలోలో రోడ్డు పక్కన బైకును నిలిపి మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో బావుసాయిపేట నుంచి వేములవాడ వెళ్తున్న గుర్తుతెలియని కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి, ప్రవీణ్, తిరుపతి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం.. ఇద్దరి రిమాండ్

వేములవాడరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు వేమువాడ రూరల్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. గంగాధర మండలం ఉప్పర మల్యాలకు చెందిన బందరకంటి తిరుపతి, మంచిర్యాలలోని వికాస్‌నగర్‌కు చెందిన గుమ్మా జగన్నాథరావు వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన ఎడపల్లి స్వామికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. అతడి వద్ద 7,80,000 రూపాయలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారు. ఈ సంఘటనలో ఇద్దరిని రిమాండ్‌కి తరలించామని, హైదరాబాద్‌కు చెందిన పవన్‌రాజ్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు


మృతుడి దేహాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

వెల్గటూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలో ఆస్తి కోసం రక్తం పంచుకు పుట్టిన అన్నను చంపిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మెల భారతమ్మ శంకరయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సుమన్(34), డిల్లేష్ ఉన్నారు. సుమన్ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమ్మరిపల్లి గ్రామంలో తల్లికి వారసత్వంగా వచ్చిన సుమారు 32 గుంటల భూమి ఉంది. రెండు నెలల క్రితం ఆ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుదారుడు బయానగా 2,60,000 రూపాయలు ఇచ్చాడు. బయానా డబ్బులు డిల్లేష్ ఒక్కడే వాడుకున్నాడు. ఆ డబ్బుల్లో తన వాటా తనకు ఇవ్వాలని అన్న సుమన్ తమ్ముడు డిల్లేష్‌ను అడిగాడు. ఈ విషయంపై తరచూ అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతోంది. 20 రోజుల క్రితం డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ ఇద్దరు కలిసి సుమన్‌పై దాడి చేశారు. అప్పటి నుంచి అన్న సుమన్‌ను చంపితే ఆస్తి మొత్తం తనకే చెందుతుందని డిల్లేష్ భావించాడు. సోమవారం రాత్రి సుమన్ కిరాణం షాపునకు వెళ్లడం గమనించిన డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ సహాయంతో దాడిచేసి కత్తితో దాడి చేసి హతమార్చాడు. హత్య అనంతరం ఇద్దరూ గుట్టుచప్పుడు కాకుండా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

షాపునకు వెళ్లిన సుమన్ ఎంతకీ ఇంటికీ రాక పోవడంతో తల్లి భారతమ్మ ఫోన్ చేసింది. ఫోన్ ఎంతకీ లేపకపోవడంతో గాలిస్తుండగా కిరాణం షాపు సమీపంలో సుమన్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మృతుడి సోదరుడు డిల్లేష్ ఇంటికి వెళ్లడంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. డిల్లేష్ నేరం అంగీకరించాడని సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. మృతుడు సుమన్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

7న ఎస్‌యూలో మెగా జాబ్ మేళా

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్



మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 7న హెచ్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 కంపెనీలతో ఐదు వేల ఖాళీల భర్తీకి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళా ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఐటీ, ఫార్మా, నర్సింగ్, హాస్పిటాలిటి, బ్యాంకింగ్, రిటైల్, మేనేజ్‌మేంట్ తదితర సెక్టార్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. బీటెక్, ఎంటెక్, ఆల్ గ్రాడ్యుయేట్స్, పీజీ, ఫార్మా, నర్సింగ్‌కు సంబంధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 2020-2025 వరకు చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8121212873, 7337373575 నంబర్లలో సంప్రదించాలని వీసీ అన్నారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ప్రొఫెసర్ మనోహర్, హెచ్‌ఆర్ కంపెనీ నిర్వాహకులు తాళ్లపెల్లి అశోక్ పాల్గొన్నారు.

నేడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

శాతవాహన యూనివర్సిటీలో విద్యార్థుల కోసం బుధవారం ఉదయం 10:30 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నటు వీసీ ఉమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇంగ్లీష్‌పై నైపుణ్యం పెంచేందుకు మూడు నెలల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వీసీ తెలిపారు.

భూసేకరణ గ్రామసభను బహిష్కరించిన రైతులు

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలికోట సూరమ్మ చెరువు కుడి కాలువ నిర్మాణం చేయడానికి భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామసభను గోవిందారం రెవెన్యూ పరిధిలోని గోవిందారం, దేశాయిపేట, రాజ లింగంపేట రైతులు మంగళవారం బహిష్కరించారు. సంబంధిత రైతులతో తహసీల్దార్ రవికుమార్ మంగళవారం మధ్యాహ్నం భీమారం మండలంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. భూ నిర్వాసిత బాధితులందరు కలిసి భూసేకరణ నిలుపు దల చేసి తమకు న్యాయం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. భూసేకరణలో సన్న, చిన్నకారు రైతులము ఉన్నామని, తమ కుటుంబాలకు ఈ భూములే ఆధారమని అధికారులతో వారు పేర్కొన్నారు. ఈ భూమిని ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు భూసేకరణ నిలుపుదల చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులు వినతి పత్రం సమర్పించారు.

థాయిలాండ్‌లో తప్పిపోయిన ఇద్దరు తెలంగాణవాసులు


ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అరవింద్, సాగర్ భార్యలు

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్‌కు రెండు లక్షల రూపాయల చొప్పున చెల్లించి విజిట్ వీసాపై థాయిలాండ్‌కు వెళ్లిన ఇద్దరు తెలంగాణవాసులు కొన్ని రోజులుగా అక్కడ కనిపించడం లేదు. నిజామాబాద్ జిల్లా శెట్టిపల్లికి చెందిన శనిగారపు అరవింద్, జగిత్యా ల జిల్లా ఆత్మకూరుకు చెందిన కొండ సాగర్ గత నెల 11న ముంబాయి నుంచి థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌కు వెళ్లారు. ఆ తర్వాత 21 నుంచి వారు అందుబాటులో లేకుండాపోయారని, ఫోన్ చేస్తే కలువడం లేదని అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారి వెంట కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకుడు వినోద్‌కుమార్, మంద భీంరెడ్డి ఉన్నారు. కాగా తప్పిపోయిన ఇద్దరి ఆచూకీ తెలుసుకుని ఏజెంట్‌పై పోలీస్ కేసు నమోదు చేయాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జీడీకే 7ఎల్‌ఈపీలో హెడ్ ఓర్‌మ్యాన్ మృతి


సత్యనారాయణ(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా-2 పరిధి జీడీకే 7ఎల్‌ఈపీ గనిలో మంగళవారం ప్రమాద వశాత్తు హెడ్ ఓర్‌మ్యాన్ తీట్ల సత్యనారాయణ(45) మృతిచెందాడు. మూతపడిన 7ఎల్‌ఈపీ గనిలో ఇసుక నింపే పనులు జరుగుతున్నాయి. మంగళవారం మొదటి షిఫ్టు విధులకు వచ్చిన సత్యనారాయణ మరో జనరల్ మజ్దూర్‌తో కలిసి ఇసుక నింపే పనులను పర్యవేక్షిస్తున్న క్రమంలో మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. జనరల్ మజ్దూర్ ఇచ్చిన సమాచారంతో రెస్క్యూ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గనికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ స్వగ్రామం జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


మృతదేహం వెలికితీసే పనుల్లో రెస్క్యూ టీం

అంగవైకల్యం ఉన్నా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు

● కాళ్లు చచ్చుబడినా నాలుగు పట్టాలు

● బండలింగంపల్లి యువకుడు వెంకటేష్ ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యం ఉన్నా ఆ యువకుడు ఏనాడూ బాధపడలేదు. నడవలేకపోయినా చేతులతో పాఠశాల వరకు వెళ్లి పాఠాలు నేర్చుకున్నాడు. అతడి ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం మోకరిల్లింది. చదువులో నాలుగు పట్టాలు పొంది అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ యువకుడు కుంట వెంకటేశ్ చిన్ననాటి నుంచి చదువంటే ప్రాణం. మూడేళ్ల ప్రాయం లోనే పోలియో బారిన పడడంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అమ్మానాన్నలు పడుతున్న కష్టాన్ని చూడలేని వెంకటేశ్ చదువుకోవాలని భావించాడు. శరీరం సహకరించకపోయినా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి, ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. చిన్నతనంలో తల్లిదండ్రులు భూదవ్వ-నాంపల్లి వెంకటేశ్‌కు పాఠశాల వరకు తీసుకెళ్లేవారు. చేతిలో డబ్బులు లేకపోయినా తల్లిదండ్రులు కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బుల్లో కొంత పుస్తకాలు, నోటు పుస్తకాలకు వెచ్చించేవారు. 2007-2009 వరకు మండలంలోని గొల్లపల్లిలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. కరీంనగర్‌లో డీఎడ్, అనంతరం అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ చదివాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎడ్, ఎంఎడ్ చేయడంతోపాటు దూర విద్యలో ఎంఏ తెలుగు పూర్తి చేశాడు. ప్రస్తుతం ఎంఏలో సైకాలజీ చదువుతున్నాడు. ప్రభుత్వ కొలువులకు దరఖాస్తు చేసుకున్నా కొద్ది పాటి వ్యత్యాసంతో ఉద్యోగం సాధించలేకపోయాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా చదువుతూనే ముందుకు సాగుతున్నాడు.


ప్రాక్టికల్‌లో భాగంగా వీల్‌చైర్‌లో పాఠాలను బోధిస్తున్న వెంకటేశ్


చదువుకుంటున్న వెంకటేశ్

చిన్నప్పటి నుంచి చదువంటే ఇష్టం

మాది నిరుపేద కుటుంబం. చిన్నతనం నుంచి చదువంటే ఇష్టం. అమ్మానాన్నలు పడుతున్న కష్టం చూడలేకపోయాను. ఉన్నత చదు వులు చదివి ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని నిర్ణయించుకున్నా. చిన్నతనంలో అమ్మానాన్నలు పాఠశాలకు తీసుకెళ్లి తీసుకొచ్చేవారు. ఉన్నత విద్యాభ్యాసంలో మిత్రులు సహకరించారు. చదువుకు అవస రమైన పుస్తకాలు సమకూర్చేవారు. ఉపాధ్యాయ కొలువు కొట్టాలనేది నా లక్ష్యం.

- కుంట వెంకటేశ్, యువకుడు

నేడు పెద్దపల్లిలో సీఎం సభ

● హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుధవారం పెద్దపల్లిలో నిర్వహించనున్న యువ వికాసం బహిరంగ సభకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు హైదరాబాద్ హెలీకాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు సభాస్థలికి చేరుకోనున్నారు. అక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించనున్నారు. 4:30 గంటలకు జ్యోతిప్రజ్వలన చేసి తెలంగాణ రాష్ట్ర గీతంతో సభ ఆరంభించనున్నారు, 4:35 నుంచి 4:55 గంటల వరకు వివిధ శాఖల మంత్రులు ప్రసంగించనున్నారు. ఆ తర్వాత 9007 మంది గ్రుపు 4, సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన వారిలో 10 మంది నియామక పత్రాలను అందజేయనున్నారు. స్కిల్ యూనివర్శిటీకి సంబంధించి 7 ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. సీఎం కప్ పోటీల కప్ ఆవిష్కరించనున్నారు. 5:10 నుంచి 5:20 వరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రసంగించనున్నారు. అనంతరం 5:20 నుంచి 5:50 గంటల వరకు అరగంట సేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అధికారులు పరిశీలించారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేశామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మం గళవారం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ ఎం శ్రీనివాస్

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య కలగకూడదని ప్రజల సౌకర్యార్థం ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి పోలీస్ అధికారులు సూచనలు జారీ చేశారు. బుధవారం ఉదయం నుంచి ట్రాఫిక్ డైవర్షన్స్ అమల్లో ఉంటాయని, ప్రజలందరూ సహకరించ గలరని విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు ప్రజలు ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు చూసుకో వాలని పోలీస్ వారి సూచనలు జారీ చేశారు.

రామగుండం నుంచి కరీంనగర్ వైపు వెళ్లే అన్ని వాహనాలు ధర్మారం ఎక్స్‌రోడ్(బసంత్‌నగర్) ద్వారా కుక్కల గూడూరు, రాజారాంపల్లి, ధర్మా రం, చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, మంథని వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్లే భారీ వాహనాలు అప్పన్నపేట, ధర్మారం ఎక్స్‌రోడ్ (బసంత్‌నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం, చొప్ప దండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, మంథని వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్లే 4 వీలర్లు అప్పన్నపేట నుంచి ఎడమ వైపు తీసుకుని బొంపల్లి, దొంగతుర్తి, ధర్మారం, చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, కరీం నగర్ నుంచి రామగుండం, మంథనివైపు వెళ్లే భారీ వాహనాలు ముగ్దుంపూర్ ఎక్స్ రోడ్ నుంచి కరీంనగర్-లక్సెట్టిపేట రోడ్ ద్వారా చొప్ప దండి, ధర్మారం, రాజారాంపల్లి వద్ద కుడి వైపు తీసుకుని కుక్కలగూడూర్, ధర్మారం ఎక్స్‌రోడ్ ద్వారా రాజీవ్ రహ దారి (కరీంనగర్- రామగుండం)కు చేరుకుని రామగుండం, మంథనివైపు వెళ్లాలని, కరీంనగర్ నుంచి పెద్ద పల్లి, రామగుండం వైపు వచ్చే 4వీలర్‌లు సుల్తానాబాద్ మండలం నారా యణపూర్ ఎక్స్‌రోడ్ నుంచి నారాయణపూర్, కొదురుపాక, నిమ్మ నపల్లి, పెద్దపల్లి సాగర్‌రోడ్, జూనియర్ కాలేజ్‌రోడ్(ఎంబీ గార్డెన్‌రోడ్), అయ్యప్ప జంక్షన్ ద్వారా రామగుండం, మంథనివైపు వెళ్లాలని సూచించారు.

సీఎం పర్యటన సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలి గించే విధంగా కార్యక్రమాలు చేసినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, ఐజీ హెచ్చ రించారు. చట్టవ్యతిరేక, ప్రజా శాంతికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎలాంటి సంఘ టనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని అన్ని వర్గాల ప్రజలు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులతో సహకరిం చాలని సీపీ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్ మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, మంచిర్యాల డీసీపీ భాస్కర్, కొమరంభీమ్ ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకటపద్మ ఫంక్షన్ హాల్లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశామ న్నారు. మొత్తం 200 మంది పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏడుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు 3, డీఎస్పీ/ఏసీపీలు 15, సీఐలు 48, ఎస్సైలు 124, మహిళా ఎస్ఐలు 15, ఏఎస్సై/ హెడ్ కానిస్టేబుళ్ళు 316, కానిస్టేబుళ్లు 846, హోంగార్డ్సు 384 మంది, క్యూఆర్టీ మెంబెర్స్ 70, 10 స్పెషల్ పార్టీలతో పక డ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పెద్దపల్లి కలెక్టరేట్‌లోని హెలి ప్యాడ్, పబ్లిక్ మీటింగ్, శిలాఫల కాల ప్రారంభోత్సవాల, రూఫ్ టాప్, పబ్లిక్ మీటింగ్, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులకు భద్రతా పరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు బందో బస్తును సెక్టార్లుగా విభజించి డీఎస్పీ/ఏసీపీలు ఇన్‌చార్జీలుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోప్ పార్టీలు, రోడ్ ఓపెనింగ్ పార్టీలు, పెట్రోలింగ్ పార్టీలు, ట్రాఫిక్ డైవర్షన్, పికెటింగ్, బిడి టీమ్స్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించా లని, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ సెక్టార్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు..

సభాస్థలిని పరిశీలించిన మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మల్టీ జోన్ ఐజీ-1 చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా, ఐజీ సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్వహణ, వివిపీ ప్రాంతాల సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు పరిశీలించారు. వివిపీల కోసం ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచనలు జారీ చేశారు.

కొండగట్టులో భక్తుల సందడి


ప్రత్యేక అలంకరణలో గర్భగుడి

మల్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

● ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. విజయోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

అంజన్నను దర్శించుకున్న హీరో వరుణ్‌తేజ్


వరుణ్‌తేజ్‌కు స్వామి వారి చిత్రపటం బహుకరిస్తున్న ఈవో, అర్చకులు

మల్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి చెందిన హీరో వరుణ్‌తేజ్ మంగళవారం కొండగట్టు అంజనే యస్వామిని దర్శించుకున్నారు. హనుమాన్ దీక్షలో ఉన్న వరుణ్ ఆలయానికి రాగా ఈవో రామకృష్ణరావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధానార్చకులు రామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించగా ఈవో రామకృష్ణరావు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం బహుకరించారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ హనుమాన్ దీక్ష తీసుకున్న తాను స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

సైదపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్, వెంకటేశ్వర్లపల్లిలో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోరుట్ల పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 106 పాడి పశువులకు గర్భ పరీక్షలు, గర్భాశయ వ్యాధుల చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి అంబిక, డాక్టర్ అనీల్, 52 మంది విద్యార్థులు, కరీంనగర్ పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎన్ సత్యప్రసాద్‌రెడ్డి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పెన్షనర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 17ను జాతీయ పెన్షన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు వైద్య సేవలు అందించాలనిడిమాండ్ చేశారు. 2024 నుంచి రిటైర్ అయిన వారికి రావాల్సిన జీపీఎఫ్ గ్రాట్యుటీ కమ్యూనికేషన్ లీవ్ సాలరీ తదితర ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం 2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, వేల్పుల ప్రకాష్ రావు, పూజా అశోక్, సత్యనారాయణ, కరుణ, విఠల్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా గంగాధరలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సాగునీరందించడానికి అసంపూర్తిగా ఉన్న ఓటీ పనులు నడుస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. తన కుటుంబంలో విషాదం జరిగిన సమయంలో నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచి మనోధైర్యం చెప్పారన్నారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. అంతకు ముందు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 281 మందికి మంజూరైన 7.50లక్షల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, చొప్పదండి, రామడుగు, బొయినపల్లి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు మహేష్, బొమ్మరవేణి తిరుమల, ఎల్లేష్ యాదవ్, చొప్పదండి మున్సిపల్ కౌన్సిలర్ అశోక్, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, నారాయణ, ఆనందరెడ్డి, రమణారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు


బద్ది పోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బోనాలతో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలు, పాడిపంటలు చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు బద్ది పోచమ్మను వేడుకున్నారు. వేములవాడలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఉదయం రాజన్న దర్శనం చేసుకున్న భక్తులు రాత్రి ఆలయ వసతి గదుల్లో విడిది చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి మట్టి కుండల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య బద్దిపోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం పోశారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్‌లో విద్యార్థినుల ప్రతిభ


జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీల్లో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 2వ తేదీన ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించినట్లు పీడీ, జట్టు కోచ్ అనిల్‌గౌడ్ మంగళవారం తెలిపారు. మొత్తం 26 జట్లు పాల్గొనగా గొల్లపల్లి విద్యార్థినులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలువురు అభినందించారు.

గురుకులంలో విద్యార్థుల చన్నీటి స్నానాలు

- వేడి నీళ్లు లేక విద్యార్థుల ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గురుకుల బాలురుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు ఉన్నారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో ఉదయం చన్నీటి స్నానాలు చేసేందుకు విద్యార్థులు వణికిపోతున్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం గీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధులు పాలకులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కొద్ది రోజుల క్రితం గురుకులంలో జరిగిన సంఘటనలతో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో రాష్ట్ర స్థాయి అధికారులు సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు విద్యార్థులకు కాట్ బెడ్‌లతో పాటు దుప్పట్లు అందించారు. వాటితో పాటు మరికొన్ని వసతులను కల్పించారు.


ఆరుబయట వాటర్ ట్యాంక్ వద్ద చన్నీట స్నానం చేస్తున్న విద్యార్థులు

వాటర్ హీటర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం

- మాధవీలత, గురుకులం ప్రిన్సిపాల్, పెద్దాపూర్

చలికాలం కావడంతో విద్యార్థులకు వేడినీటి వసతి కల్పించడానికి వాటర్ హీటర్‌లను ఏర్పాటు చేయడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపాము. ఇటీవలే విద్యార్థులకు కాట్‌బెడ్‌లతో పాటు బెడ్‌షీట్లు, దుప్పట్లు అందించాము.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను సమకూరుస్తున్నారు.

ఆర్టీసీ ఆర్ఎంగా రాజు బాధ్యతల స్వీకరణ

భగత్ నగర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్‌గా బి.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్ఎంగా పనిచేసిన సుచరిత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రీజనల్ మేనేజర్‌కు డిప్యూటి రీజనల్ మేనేజర్ కె సత్యనారాయణ, ఎస్ భూపతి రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్ఎం రాజు కలెక్టర్ పమేలా సత్పతిని, పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కరంనగర్ 2 డిపోను ఆర్ఎం సందర్శించి గ్యారేజీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ఆర్ఎం రాజుకు మొక్కను అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్రలోని పుణే పట్టణంలోని చత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహించిన 27వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ ఒకినావా స్కూల్ విద్యార్థులు 19 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి, ట్రైనీ ఐపీఎస్ వసుంధర అభినందించారు. ఈ సందర్భంగా ఒకినా వా సంస్థల చీఫ్ అఫీషియల్ కె వసంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరు గోల్డ్ పతకాలు, ఐదు సిల్వర్ పతకాలు, ఎనిమిది బ్రాంజ్ పతకాలు సాధించినట్లు తెలిపారు. కోచ్‌గా కరీంనగర్ నుంచి ఫుల్లూరి శ్రీనివాస్, మేనేజర్‌గా కె రాజశేఖర్ వ్యవహరించారు.

రూ.7150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 102క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,150 రూపాయలు, కనిష్ఠ ధర 6500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అదేవిధంగా 230 మంది రైతులు 3,815 క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపిక

చిగురుమామిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన అప్ష మహేవిష్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అవు పేడ మన నిత్య జీవిత అవసరాలను ఎలా తీరుస్తుంది' అనే ప్రదర్శన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఓదెలుకుమార్‌ను సన్మానించినారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గౌతం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక అయ్యాడు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గౌతం ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యాడు. గౌతంను ప్రిన్సిపాల్ సుధాకర్, గైడ్ టీచర్లు రాధ, ముక్తిప్రసాద్ అభినందించారు.

● చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రావణ్‌కుమార్‌కు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ బహుమతి లభించింది. ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్ అభినందించారు.

బాధితుడికి ప్రభుత్వ విప్ ఆర్థిక సాయం

పెగడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దీకొండ గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితుడికి ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం రూ. 11 వేలు ఆర్థిక సాయం అందించారు. దీకొండ గ్రామానికి చెందిన గోపులాపురం గోపాల్ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో బలమైన గాయాలు కాగా శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్థానిక నాయకులతో రూ 11 వేలు పంపించారు.

విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు మంగళవారం ఉచిత మధ్యాహ్న భోజనం కార్యక్ర మాన్ని కాలేజ్ ప్రిన్సిపాల్ వేంకటేశ్వరరావు, స్థానిక కూరగాయల వ్యాపారి మొబీన్ చేతుల మీదుగా ప్రారంభించారు.

భారత దేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) భారత దేశం అంటేనే భిన్న త్వంలో ఏకత్వమని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవాలను కన్నుల పండగగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కళాకారులు చక్కగా వివరించారన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామ మున్నూరు కాపు సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా దీటి రాజన్న, ఉపాధ్యక్షుడిగా ముంజం వంశీ, క్యాషియర్‌గా దీటి శంకర్, కార్యవర్గ సభ్యులుగా జక్కుల భూమయ్య, ముంజంరాజన్న, మల్లేశం, రాజన్న, రాజేశంలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ వ్యతిరేకత అనేది ప్రతిపక్షాల కుట్ర

● జగిత్యాల అభివృద్ధి బాధ్యత సీఎం తీసుకున్నారు ● పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత అనేది ప్రతిపక్షాల కుట్ర అని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలతో పాటు ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించారని పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల పరిశీలనకు జగిత్యాల పట్టణానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో, ప్రజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దగ్గరకు వస్తే పనులు అవుతాయో లేవోనని సందేహపడుతున్నట్లు తెలిసిందని, ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. జగిత్యాల అభివృద్ధి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్, చైర్మన్ సన్మానించారు.

అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిశాను ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వంతో కలిశానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా జగిత్యాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 164 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల 18లక్షల బ్యాంక్ లింకేజీ చెక్కులను, చిరు వ్యాపారులకు రూ. 25 లక్షల స్ట్రీట్ వెండర్ చెక్కులను, 13 మహిళా సంఘాలకు 63 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 20 లక్షల ఇందిరా మహిళలకు చెక్కులను, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణానికి రూ.9 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● రాయికల్ పట్టణంలో..

రాయికల్: రాయికల్ పట్టణంలో రూ.2 కోట్ల 93 లక్షల బకాయి బిల్లులు చెల్లించామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అర్బన్ డే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయికల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. చిరు వ్యాపారులకు రూ.10 లక్షల స్ట్రీట్ వెండర్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే 24 మహిళా సంఘాలక రూ.2 కోట్ల 20 లక్షల ఇందిరా మహిళా శక్తి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోరహన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత్‌రావు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ ఖయ్యూం, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, అనురాధ, సువర్ణ, అన్వరీ బేగం, రవీందర్‌రావు, కోల శ్రీనివాస్, మోహన్, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మహేందర్ బాబు అత్తమ్మ అందె సుభద్ర అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు.



మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

ఊరూరా ప్రజాపాలన విజయోత్సవాలు

కోరుట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయత్సవాలలో భాగంగా మంగళవారం పారిశుధ్య పనులపై అవగాహన ర్యాలీని మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య-అనిల్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్త మున్సిపల్ నుంచి కార్గిల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ నిర్వహిస్తున్న పథకాలను వివరించారు. మహిళ స్వశక్తి భవనంలో సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరత న్యాటం, జానపథ గేయాలను జరిపారు. కార్మికులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను అందించారు. కార్మికు లకు పీపీ కిట్లు, సబ్బులు, కొబ్బరి నూనె, యూని ఫాంను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ తి రుపతి, వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్‌లతో పాటు మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ధర్మపురి పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పలు కార్యాక్రమాలు మంగళవారం నిర్వహించారు. మొదట మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ వర్కర్లకు పీపీఈ కిట్స్, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌కు వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు యూనిఫారాలను అందించారు. అనంతరం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు ప్రమీల, అంజలిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషన ర్ కందుకూరి శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నీలార పు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామ య్య, మేనేజర్ గంగాధర్, సానిటీరీ ఇన్స్‌పెక్టర్ గంగాధ ర్, కౌన్సిలర్లు నాగలక్ష్మి, వేణుగోపాల్, అశోక్, సయ్యద్ యూనస్, మెప్మా టీఎంసీ జలందర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పాలక వర్గ సభ్యులు, అధికారులు,

ఉపాధి కరువు..

(3వ పేజీ తరువాయి)

గతంలో పదేళ్ల పని చేస్తే 50 ఏళ్లు నిండిన తర్వాత పింఛను అమలయ్యేది. జీవో సవరించి కొత్త నిబంధనలు తేవడంతో పలువురికి పింఛన్ దక్కడం లేదని, పాత పద్ధతినే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు. బీడీ రంగంపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) గుదిబండగా మారిందని, తక్షణమే మినహాయింపు ఇవ్వాలని అంటున్నారు. కార్మికులకు పింఛను రూ. 2,016 వరకు వస్తోంది. ప్రతి నెలా రూ. 5 వేల పింఛను అమలు చేయాలనే డిమాండ్ ఉంది. నెలలో కనీసం 24 రోజులు పనిదినాలు కల్పించాలని, వేయి బీడీలకు కూలీ రూ. 500 పెంచాలని, నెలకు దాదాపు రూ. 10 వేలు గిట్టుబాటు కావాలని కోరుతున్నారు. గతంలో బీడీ కార్మికుల కళ్లద్దాలకు రూ. 300, రెండు కాన్పులకు ప్రసూతి సాయం రూ. వెయ్యి, టీబీ పరీక్షలు మందులు, గుండె జబ్బులు రూ. 1.30 లక్షలు, మూత్ర పిండాల మార్పిడికి రూ. 2 లక్షలు, కార్మికుల పిల్లల్లో వితంతువులు ఉంటే రూ. 5 వేలు ఆర్థిక సాయం అం దేది. దహన సంస్కారాలకు రూ. 1,500, సొంత స్థలం ఉండి ఇళ్ల నిర్మాణం చేసుకుంటే రూ. 1.50 లక్షల సబ్సిడీ సాయం ఉండేది. ఇప్పుడు ఆపథకాలు అమలులో లేకుండా పోయాయి.

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

బొద్దున అరుణ, బీడీ కార్మికురాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సంక్షేమానికి అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చేతినిండా పని కల్పించాలి. కనీసం కుటుంబ ఆర్థిక అవస రాలకు సరిపోయే విధంగా ఆదాయం వచ్చేలా ప్రయత్నాలు చేయాలి. విద్యా రంగంలో కార్మికుల పిల్లలకు అవస రమైన రిజర్వేషన్లు కల్పించాలి.

నిబంధనల మేరకు పని దినాలు కల్పించాలి

సుతారి రాములు, ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి



బీడీ కార్మికులకు నిబంధనల మేరకు పనిదినాలు కల్పించాలి. ప్రతీ నెల 26 రోజులకు తగ్గకుండా పనిదినాలు కల్పించాల్సి ఉండగా, పలు కంపెనీల యాజ మాన్యాలు పది నుంచి పదిహేను రోజుల మాత్రమే పని దినాలు కల్పిస్తున్నారు. దీంతో చాలీచాలని ఆదాయంతో కార్మికులు ఆర్థిక కష్టాలకు గురవుతున్నారు.

సైబర్ వలలో చిక్కిన యువకుడు

● రూ.90 వేలు పోగొట్టుకున్న వైనం

వెల్గటూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏఎస్సై కూతురు ఆరోగ్యం బాగా లేదని తక్షణమే డబ్బులు పంపాలని ఓ ఫోన్ కాల్ రాగానే సైబర్ వేటగాడి వలలో పడి సదరు యువకుడు ఏకంగా రూ. 90 వేలు పోగొట్టుకున్న సంఘటన వెల్గటూర్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. హరీష్ అనే యువకుడు వెల్గటూర్‌లో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం హరీష్‌కు ఏఎస్సై కూతురుకు ఆరోగ్యం బాగాలేదని ఫోన్ పేలో క్యాష్ తక్షణమే పంపాలని, తరువాత లిక్విడ్ క్యాష్ ఇస్తామని నమ్మబలికాడు. తన వద్ద డబ్బు లేక పోవడంతో ఫెర్టిలైజర్ దుకాణం నడుపుతున్న మరో వ్యక్తి తిరుపతిని అడగాలని చెప్పాడు. దీంతో సైబర్ మోసగాడు తిరుపతి ఫోన్ నంబరు అతని వద్ద తీసుకొని మంగళవారం తిరుపతికి ఫోన్ చేశాడు. హరీష్ అప్పటికే తిరుపతికి ఫోన్ చేసి మనకు తెలిసిన పోలీసులే డబ్బు ఇవ్వాలని చెప్పాడు. నమ్మిన తిరుపతి సైబర్ మోసగాడు పంపిన స్కానర్‌కు ఫోన్ పే ద్వారా రూ.90 వేలు పంపించాడు. లిక్విడ్ క్యాష్ పంపుతామని చెప్పిన వారు ఇంకా డబ్బులు పంపక పోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

జగిత్యాలలో 'మధ్యాహ్న భోజన' కార్మికుల ఆందోళన

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు మంగళవారం జగిత్యాలలో ఆందోళన చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పలు రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. సమస్యలు పరిష్క రించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. వంట కార్మికులకు ఇస్తున్న రూ. 3 వేల గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ బిల్లులు రూ. 25కు పెంచాలని, లేదంటే ప్రభుత్వమే నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 కోడిగుడ్డు బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. మార్కెట్‌లో రూ. 7 నుంచి రూ. 8 వరకు ఒకటి చొప్పున కోడి గుడ్డు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. ప్రతీ నెల 5వ తేదీ లోపు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు వెన్న మహేశ్, మెనుగూరి హన్మంతు, ఎండీ ముఖ్రం, సుతారి రాములు, పద్మ, లక్ష్మీ, గంగు, రాధ, శారద, లత, సంధ్య, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో ర్యాలీ చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

వైద్యులు సమయ పాలన పాటించాలి

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఆన్‌లైన్ రిజిష్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసూతి సేవలను, వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓపీలు చూస్తున్నారని, ఆసుపత్రిలో నార్మల్ డెలివరిలను పెంచేందుకు గర్భిణులను ప్రోత్సహించాలని డాక్టర్లకు సూచించారు. పెషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలని, తాగునీరు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రమైన తాగునీరు సరఫరా చేసే విధంగా వాటరు ప్లాంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఎంవో రామకృష్ణ, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అదించారు. మండలంతో పాటు రూ. 5,25,500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్లు ఉమారాణి, సజ్జు మాజీ సర్పంచ్‌లు అంజయ్య పాల్గొన్నారు.

●పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంలో రూ. 1.43 కోటి నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమృత్ స్కీం ద్వార నీటి సరఫరా పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమీషనర్ తిరుపతిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెప్మా భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మెప్మా భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 50 లక్షల రూపాయలతో నిర్మించిన మెప్మా భవనాన్ని ప్రారంభించానని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చేసిన అభివృద్ధి ఎం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ మోహన్, కౌన్సిలర్‌రు, పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై సమాఖ్య లీడర్ల ఆగ్రహం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తమకు సంబంధించిన భవనం తమకు చెప్పకుండ ఎలా ప్రారంభిస్తారంటూ మహిళలు మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మెప్మా భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించగా పట్టణానికి చెందిన మహిళ సమాఖ్య సంఘం అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మీతో పాటు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మెప్మా భవనాన్ని ప్రారంభించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆహ్వానించగా మంత్రి రాక ముందే భవన ప్రారంభోత్సవం ఎలా చేస్తారని కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్, కౌన్సిలర్ షాకీర్, కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇబ్బందులు కలుగకుండా ధాన్యం తూకం వేయాలి

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తీసుకొచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకంవేయాలని చైర్మన్ కూన గోవర్ధన్ సూచించారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మెట్‌పల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం కుప్పల మ్యాచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన ధాన్యంను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఇంద్రసేనరెడ్డి, సూపర్‌వైజర్ హరికృష్ణ, సతీష్, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం

మల్యాల, డిశంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముత్యంపేటకు చెందిన కొండబత్తిని అనిల్ నియామకం అయ్యాడు. ఈ మేరకు నియామకపు పత్రంను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళ వారం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు నేరెళ్ల సతీష్‌రెడ్డి ఉన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే సత్యం ఇతర నాయకులకు అనిల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాడు

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులచే కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, ఎస్సై సుధీర్ రావు, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడు చెంగళి మహేష్, జనరల్ సెక్రటరీ పసుల గంగాధర్ పాల్గొన్నారు.

బుగ్గారం: అంగవైకల్యం ఉందని అధైర్య పడకుండా దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలని ఎంఈవో వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం బుగ్గారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు ఐఈఆర్‌పీ సమత ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బుగ్గారం జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సీ ఆర్‌పి పురుషోత్తం, ఎంఐఎస్ రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

పెగడపల్లి : మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నామాపూర్, పెగడపల్లి, నంచర్లకు చెందిన దివ్యాంగ విద్యార్థులు పాల్గొనగా వారికి సమగ్ర శిక్ష అభియాన్ నుంచి అందుతున్న సేవలను వివరించారు. ఎంఈవో సులోచన దేవి, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు లలిత, సుమలత, లచ్చయ్య ఐఆర్‌పీ శ్రీలీల, మల్లేశం పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘణంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ అధికార సేవ సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ వికలంగుల హక్కుల పరిరక్షణ కోసం పాటు పడాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, అదను డిఅర్డీఏ మదన్మోహన్, జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేష్, క్రీడాధికారి రవి కుమార్, దివ్యాంగ సంఘం నాయకుడు లంకదాసరి శ్రీనివాస్, సీడీపీవోలు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని మున్సిపల్‌తో పాటు సాయి రాంపుర కాలనీలో వికలాంగుల దినోత్సవ వేడుకలను మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్‌లతో పాటు సిబ్బంది, సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగులచే కేక్ కట్ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, అధికారులు

జాతీయ క్రీడలకు ఎంపిక

కొడిమ్యాల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, అండ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్య గంగోత్రి అండర్ 19 కబడ్డీ ఎస్‌జీఎఫ్ జాతీయ క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి. లావణ్య మంగళవారం తెలిపారు. డిసెంబరు 7 నుంచి 11 వరకు హర్యానాలో నిర్వహించనున్న జాతీయ క్రీడా పోటీలలో గంగోత్రి పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడాకారిని గంగోత్రిని గంగాధరలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్. మేడిపల్లి సత్యం శాలువా కప్పి అభినందించారు. కబడ్డీ అసోసీయేషన్ సంఘం సభ్యులు సంపత్‌రావు, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, రఘుపతి, పీడీ అనూప్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మురోజు కృష్ణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మధు జాన్సన్ పాల్గొన్నారు. క్రీడాకారినికి చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ 5వేల రూపాయల నగదును అందించి అభినందించారు.

పాఠశాలల గుర్తింపు రద్దు చేయండి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) నిభందనలకు విరుద్ధంగా జగిత్యాలలో నిర్వహిస్తున్న గ్రావిటీ, శ్రీచైతన్య, సువిద్య హైస్కూల్ విద్యా సంస్థలను వెంటనే రద్దు చేయాలని జగిత్యాల జిల్లా పిడిఎస్‌యు అధ్యక్షులు అంగిడి కుమార్ జగిత్యాల ఎంఈవోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అర్హత లేని ఉపాధాయులతో చదువు చెప్పించడంతో పాటు కనీస వసతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్నారని పై ఫిర్యాదులో పేర్కొన్నారు. పిడిఎస్ నాయకులు దీపక్, రమేష్ పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి మహర్దశ పట్టేనా..?

● పదేళ్లుగా ప్రతిపాదనలకే పనులు పరిమితం ● నేడు నూతన పాలక వర్గం సమావేశం

కథలాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గడిచిన పదేళ్ల కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ప్రభుత్వం కొత్త పాలక వర్గం నేతృత్వంలో మహర్దశ పట్టనుందా అని రైతాంగం ఆశగా ఎదురుచూస్తోంది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ముచ్చటగా మూడు పాలక వర్గాలు మారినప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. అప్పుడు మార్కెట్ కార్యాలయం భవనం నిర్మాణానికి నోచుకున్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రం మోక్షం లభించలేదు. ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపించినా పనులకు మాత్రం అనుమతులు మంజూరు చేయలేదు. ఈ క్రమంలో ఇటీవల ఎన్నికైన పాలక వర్గంపై రైతాంగం ఎన్నో ఆశలు పెట్టుకుంది.

● రు. 3.5 కోట్ల నిధులున్నా నిష్ప్రయోజనం

మార్కెట్ కమిటీకి ప్రతీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కొనుగోళ్లు జరిగిన మొత్తంపై 1 శాతం మార్కెట్ సెస్ ఆదాయంగా వస్తుంది. ఈ మార్కెట్‌కు ప్రస్తుతం రు. 3.5 కోట్ల ఆదాయం సమకూరగా మార్కెట్‌లో మౌలిక సదుపాయాలకు వెచ్చించుకోవాల్సి ఉంది. ఈ మేరకు గత పాలక వర్గాలు తాగు నీరు. గోదాం, మురికి కాలువలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, మొరం పనుల కోసం సుమారు రు. 2 కోట్లతో ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వ ఆమోదం లభించని కారణంగా మార్కెట్‌లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. నిధులు మురిగిపోతున్నాయే తప్ప అభివృద్ధి జరగకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వెలి బుచ్చుతున్నారు. నేడు కొత్త పాలకవర్గం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించనుండడంతో ఎలాంటి తీర్మాణాలు చేయనున్నారని రైతులు ఆశగా చూస్తున్నారు.



చెట్ల పొదలతో నిండి ఉన్న మార్కెట్ స్థలం

● మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పూండ్ర నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్

మండల రైతులకు సేవ చేసే అవకాశం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. మార్కెట్ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తా. మార్కెట్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పరచడానికి పాలకవర్గ సభ్యులతో చర్చించి తీర్మాణాలు చేస్తాం.

సంక్షిప్త సమాచారం

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎనుగందుల ఉదయశ్రీ భర్త ఎనుగందుల లింగం గౌడ్ ప్రమాద వశాత్తు గాయపడగా వారిని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ మంగళవారం పరామర్శించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నవయుగ అసోసియేషన్ సౌజన్యంతో కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకూర్తి వైద్యుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్‌చైర్మెన్ చిందుర సురేష్ సహకారంతో వైద్యపరీక్షలను నిర్వహించారు. 83 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 33 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉండంగా రేకూర్తి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కుందారపు మహేందర్, గడ్డె నరేంద్ర, మంచాల జగన్, నవయుగ యూత్ సభ్యులు మహిపాల్, మోహన్ రెడ్డి, సతీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం మండల విద్యాధికారి సులోచన దేవి స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి కరీంనగర్ వారు క్రీడా దుస్తులు స్పాన్సర్ చేయగా ఎంఈవో సులోచన దేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు.

కొడిమ్యాల: కొమురంభీం గ్రామానికి చెందిన లకావత్ సుధాకర్ అనే యువకుడు గత నెల అదృశ్యమైనట్లు అతని తండ్రి మొహన్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు.

బుగ్గారం: రైతులకు ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయ అధికారి అక్షిత అన్నారు. ఈ మేరకు మండలంలోని షేకల్ల గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన కల్పించారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మంగళవారం రాయికల్ సెక్షన్ ఏఈ నవీన్ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు.

జగిత్యాల అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీఫ్ మినిస్టర్ కప్ 2024 క్రీడల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జరిగిన ఈ సమావేశంలో క్రీడాకారుల బయోడేటా ను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు.